ఘనంగా కార్తీక సోమవారం పూజలు



సంతనూతలపాడులో ప్రత్యేక అలంకరణలో త్రిపురాంతకస్వామి

సంతనూతలపాడు: సంతనూతలపాడులోని త్రిపురాంతకస్వామి, వెంకటేశ్వరస్వామి, పేర్నమిట్టలోని రామలింగేశ్వరస్వామి ఆలయాల్లో కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా ఘనంగా పూజలు నిర్వహించారు. సంతనూతలపాడులోని త్రిపురాంతకస్వామి ఆలయంలో అర్చకుడు ఎస్.బుజ్జిబాబుశర్మ ఆధ్వర్యంలో శివ పార్వతులకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకుడు పి.అజయ్‌బాబు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.



కొత్తపట్నం బస్టాండ్ సెంటర్‌లోని రాజరాజేశ్వరస్వామి ఆలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు



సంతపేట షిరిడీ సాయిబాబా మందిరంలో శివపార్వతుల కళ్యాణం నిర్వహిస్తున్న వేద పురోహితులు

భక్తిశ్రద్ధలతో శివ కళ్యాణం...

ఒంగోలు మెట్రో: కార్తీకమాసం చివరి సోమవారం సందర్భంగా నగరంలోని అన్ని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంతపేట సాయిబాబా మందిరంలో శివపార్వతుల కళ్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అయ్యప్పస్వామి పడిభజనలో పాల్గొన్న బూచేపల్లి



పడిభజనలో పాల్గొన్న బూచేపల్లి శివప్రసాదరెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మ

చీమకుర్తి: అయ్యప్పస్వామి పడిభజనలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పాల్గొన్నారు. ఆదివారం రాత్రి చీమకుర్తిలోని 7వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ పత్తి కోటేశ్వరరావు నివాసంలో నిర్వహించిన పడిభజనలో వారు పాల్గొని పూజలు చేసి భక్తిగీతాలు ఆలపించారు.

క్లుప్తంగా

గుండెపోటుతో హెచ్‌ఎం మృతి



హెచ్‌ఎంకు నివాళులర్పిస్తున్న ఎంఈఎఫ్ నాయకులు

చీమకుర్తి రూరల్: మండలంలోని ఇలపావులూరుకు చెందిన హెచ్‌ఎం పూనూరి నాగేశ్వరరావు సోమవారం ఉదయం 5 గంటల సమయంలో గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. మద్దిపాడు మండలం కానుమూరివారిపాలెం ఎలిమెంటరీ పాఠశాలలో హెచ్‌ఎంగా ఆయన పనిచేస్తున్నారు. ఆయన ఆకస్మిక మరణంపై పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు దిగ్భ్రాంతి చెందారు. నాగేశ్వరరావు భౌతికకాయానికి మద్దిపాడు ఎంఈఓ, ఎంఈఎఫ్ నాయకుడు బి.యేసుదాసు, తదితరులు నివాళులర్పించారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

మద్దిపాడు: మండల పరిధిలోని ఇనమనమెళ్లూరు గ్రామ సమీపంలో రెండు ఇసుక ట్రాక్టర్లను సోమవారం ఉదయం సీజ్ చేశారు. ఇనమనమెళ్లూరు గ్రామంలో ఇసుక తరలిస్తున్నారని గ్రామస్తులు అందజేసిన సమాచారంతో తహసీల్దార్ ఆదేశాల మేరకు గ్రామ రెవెన్యూ అధికారులు ఇసుక తవ్వుతున్న ప్రదేశానికి వెళ్లారు. ఇసుక ట్రాక్టర్లకు సంబంధించిన వారు పలాయనం చిత్తగించగా, రెండు ట్రాక్టర్లను తహసీల్దార్ కార్యాలయానికి గ్రామ రెవెన్యూ అధికారులు తరలించారు. వాటిని తహసీల్దార్ సుజన్ కుమార్ సీజ్ చేశారు.


రోడ్డు బాగుచేయాలని వినతిపత్రం

సంతనూతలపాడు: స్థానిక వడ్డెరపాలెంలో మద్దులూరు ఆర్‌అండ్‌బీ రహదారి దెబ్బతిని ప్రయాణికులు అవస్థపడుతున్నారని, రోడ్డును బాగుచేయించాలని కోరుతూ స్థానికులైన కరేటి నరసింహారావు, తదితరులు సోమవారం ఒంగోలు కలెక్టరేట్లోని స్పందన హాల్లో నిర్వహించిన మీ కోసం ప్రజావేదిక కార్యక్రమంలో జిల్లా అధికారులకు వినతిపత్రం అందజేశారు. రోడ్డు గుంతలమయంగా మారి నీరు నిలిచి దోమలు పెరిగి స్థానిక ప్రజలు అంటువ్యాధులకు గురవుతున్నారని తెలిపారు. ముఖ్యంగా బీసీ హాస్టల్‌కు వెళ్లే రహదారి వర్షం పడితే చిత్తడిగా మారిపోతోందన్నారు. ఇళ్ల మధ్యలో మాగాణిని తలపిస్తోందన్నారు. వాహనదారులు తరచూ ప్రమాదాలకు లోనవుతున్నారన్నారు. రహదారికి మరమ్మతులు చేయించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

ట్రై సైకిల్, వీల్‌చైర్ అందజేత

ఒంగోలు అర్బన్: మీ కోసం కార్యక్రమంలో అందిన వినతికి సంబంధించి కలెక్టర్ ఆదేశాల మేరకు దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ అర్చన దివ్యాంగులకు అవసరమైన పరికరాలను సోమవారం కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలు వద్ద కలెక్టర్ తమీమ్ అన్సారియా చేతుల మీదుగా అందజేశారు. ఒంగోలు మండలం పెళ్లూరు గ్రామానికి చెందిన వద్దరపు సుబ్బరత్నంకు ట్రైసైకిల్‌తో పాటు సంక కర్రలు, పామూరు మండలం బొట్లగూడురుకు చెందిన గుంజి కొండలరావుకు వీల్‌చైర్ అందజేశారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ అర్చన, ఇతర అధికారులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కమిటీ సభ్యులతో ప్రమాణం చేయిస్తున్న ఎన్నికల పరిశీలకులు

ఒంగోలు సిటీ: స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఒంగోలు మండల సమావేశంలో ఒంగోలు రూరల్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల పరిశీలకులు ఎస్.చిన్నస్వామి, ఎస్వీ కొండారెడ్డి తెలిపారు. ఒంగోలు రూరల్ అధ్యక్షునిగా దార్ల శ్రీనివాసులు, ఉపాధ్యక్షునిగా కె.వీరనారాయణ, సహాధ్యక్షురాలిగా ఎం.సంధ్యారాణి, ప్రధాన కార్యదర్శిగా బి.సోమసుందరరావు, జిల్లా కౌన్సిలర్లుగా ఎస్.రాజేశ్వరి, ఆర్.నారాయణ, కోశాధికారిగా ఎం.వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు.

సెమీక్రిస్మస్ వేడుకలు ప్రారంభం

ఒంగోలు మెట్రో: స్థానిక కర్నూల్ రోడ్డు ఫ్లైఓవర్ వద్ద గల మార్టిన్ మెమోరియల్ బాప్టిస్టు చర్చి 10వ వార్షికోత్సవం, సెమీ క్రిస్మస్ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. పాస్టర్ గూడూరి రవికుమార్, సికింద్రాబాద్ నుంచి ప్రసంగికులుగా జాన్ క్రిస్టఫర్ పాల్గొని క్రీస్తు సందేశం అందించారు. డీఆర్వో ఓబులేసు, జాన్ వండర్‌మన్ 2025 నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. చిన్నారులు క్రీస్తు పుట్టుక నాటకం ప్రదర్శించారు. పలువురు పాస్టర్లు, క్రైస్తవులు పాల్గొన్నారు.

స్త్రీల సమాజం ఆధ్వర్యంలో...

ఒంగోలు జేఎంబీ చర్చి స్త్రీల సమాజం ఆధ్వర్యంలో సోమవారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అగస్టీన్ పాస్టర్ దైవ వాక్యం అందించగా, స్త్రీల సమాజం సభ్యులు క్రీస్తు గీతాలు ఆలపించి క్రిస్మస్ కేక్ కట్ చేసి క్రీస్తు పుట్టుక నాటకం ప్రదర్శించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ప్రెసిడెంట్ సంధ్యా దీనదయాల్, వైస్ ప్రెసిడెంట్ కె.సుమన్ డేవిడ్‌రాజు, సెక్రటరీ డేవిడ్‌రాజు, జాయింట్ సెక్రటరీ ఎస్.కస్తూరి, ట్రెజరర్ సువర్ణ అలెగ్జాండర్, ఆనరరీ ప్రెసిడెంట్ మ్యూరియల్ జాషువా, పాస్టర్ షేర్వల్ పాల్గొన్నారు.



జేఎంబీ చర్చిలో క్రీస్తు గీతాలు ఆలపిస్తున్న స్త్రీల సమాజం సభ్యులు

చీమకుర్తి రూరల్: మండలంలోని చీమలమర్రి గ్రామంలో సెమీ క్రిస్మస్ వేడుకలను సోమవారం రాత్రి యవనస్తుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఏసుక్రీస్తు పుట్టినరోజు వేడుకల ప్రారంభ దినం సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. డిసెంబర్ 25 వరకు ఏసుక్రీస్తు పుట్టిన రోజు వేడుకలు ఘనంగా జరుపుకోవాలని సంఘ కాపరి రెవరెండ్ గద్దల దేవసహాయం కోరారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు జడ సుగుణరావు, జడ వీరయ్య, జడ డేవిడ్, మాగులూరి, జయేంద్రరావు, యవనస్తులు, విశ్వాసులు పాల్గొన్నారు

పీఆర్‌సీ వెంటనే ప్రకటించాలి

- యూటీఎఫ్ రాష్ట్ర శాఖ ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్.ప్రసాద్

ఒంగోలు సిటీ: ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక బకాయిలు వెంటనే మంజూరు చేయాలని, 12వ పీఆర్సీ కమిటీని వేసి అమలు చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర శాఖ ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్.ప్రసాద్ అన్నారు. యూటీఎఫ్ జిల్లా స్వర్ణోత్సవ మహాసభలు సోమవారం రెండో రోజు ఒంగోలు నగరంలోని టీటీడీ కళ్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ పీఆర్సీని ప్రకటించి ఉపాధ్యాయుల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచాలని, పీఆర్సీ రిపోర్టు ఆలస్యం అయితే ప్రభుత్వం 29 శాతం ఐఆర్ ను ప్రకటించాలని కోరారు. రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కొమ్మోజు శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యావిధానం మెరుగుపడేలా ప్రభుత్వ విధానాలు ఉండాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి నవ కోటేశ్వరరావు, ఈ మహాసభను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలను జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఒ.వి.వీరారెడ్డి, డి.వీరాంజనేయులు తెలిపారు.



స్వర్ణోత్సవ మహాసభలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్.ప్రసాద్

ఏకసభ్య కమిషన్‌ను రద్దు చేయాలి

ఒంగోలు వన్‌టౌన్: ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ అయిన రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్‌ను రద్దు చేయాలని మాల మహాసభ జాతీయ అధ్యక్షుడు మల్లెల వెంకట్రావు హైకోర్టును ఆశ్రయించినట్లు ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఏర్పాట్లు ప్రారంభం

సంతనూతలపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో డిసెంబర్ 5 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఏర్పాట్లను సోమవారం ప్రారంభించారు. సూదనగుంట కోటయ్య చౌదరి, ఆదిలక్ష్మి మెమోరియల్ 71వ ఆంధ్ర సీనియర్ స్త్రీ, పురుషుల కబడ్డీ చాంపియన్‌షిప్ నిర్వహించేందుకు చేస్తున్న ఏర్పాట్లను సూదనగుంట ఫౌండేషన్ నిర్వాహకుడు సూదనగుంట కృష్ణమూర్తి, హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్‌ఎం ఎస్.ఫణిపద్మకుమారి భూమి పూజ చేసి ప్రారంభించారు. ముందుగా సంతనూతలపాడులోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేశారు. సూదనగుంట ఫౌండేషన్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎన్నారై ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ సూదనగుంట రాఘవేంద్ర ప్రసాద్, ఫౌండేషన్ నిర్వాహకుడు సూదనగుంట కృష్ణమూర్తి నాలుగు రోజులపాటు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను సాయంత్రం 5 నుంచి 9 గంటల వరకు ఫ్లడ్ లైట్ల వెలుగులో నిర్వహించనున్నారు. క్రీడాకారులకు వసతి, భోజన సౌకర్యాలు కూడా కల్పిస్తున్నారు. ఆ ఏర్పాట్లు ప్రారంభించేందుకు నిర్వహించిన భూమి పూజ కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కుర్రా భాస్కరరావు, చైర్మన్ ఎస్.చంద్రమోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షులు కే ప్రసాదరావు, పి.చంద్రశేఖరరెడ్డి, మాజీ జెడ్పీటీసీ తన్నీరు శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ రంపతోటి అంకారావు, సొసైటీ మాజీ అధ్యక్షుడు సాదినేని శ్రీరామమూర్తి, శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధి అమరా దనశేఖర్, బండ్లమూడి హైస్కూల్ పీడీ బాపట్ల శేషగిరిరావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల నిర్వాహకులు

రాజకీయ నాయకుల అండతోనే మహిళలపై హింస



ప్రసంగిస్తున్న డాక్టర్ ఉదయిని

ఒంగోలు టౌన్: రాజకీయ నాయకుల అండదండలతోనే సమాజంలో మహిళలపై హింస జరుగుతోందని, కేసులు నీరుగారిపోతున్నాయని ప్రముఖ వైద్యురాలు ఉదయిని అన్నారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని ఓ ప్రైవేటు కాలేజీలో ప్రపంచ హింస వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ప్రసంగిస్తూ మహిళలపై హింసను అరికట్టేందుకు తీసుకొచ్చిన చట్టాలను ప్రభుత్వాలు సక్రమంగా అమలు చేయకపోవడం, సకాలంలో తగిన శిక్షలు విధించకపోవడం వలన కూడా హింస పెచ్చుమీరిపోతోందన్నారు. మహిళలపై హింస విషయంలో రాష్ట్రంలో సగటున రోజుకు 70 కేసులు నమోదవుతున్నాయని ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి చెప్పారు. వీటిలో అసలు కేసుల దాకా రాని సంఘటనలే ఎక్కువగా ఉంటాయని తెలిపారు. సెమినార్‌లో ఐద్వా నాయకులు ఎస్కే నాగూర్‌బీబీ, రాజ్యలక్ష్మి, గోవిందమ్మ, పెద గోవిందమ్మ పాల్గొన్నారు. ప్రజానాట్యమండలి గాయకురాలు సుజాత ఆలపించిన విప్లవ గేయాలు ఆకట్టుకున్నాయి.

సరళాదేవినగర్ వాసులకు ఇళ్లపట్టాలు ఇవ్వాలి

ఒంగోలు టౌన్: నగరంలోని పేర్నమిట్ట సరళాదేవి నగర్లో నివాసం ఉంటున్న అర్హులకు వెంటనే ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ ఒంగోలు కార్పొరేషన్ పరిధిలోని 41వ డివిజన్లో సరళాదేవినగర్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన 180 కుటుంబాలు గత 20 సంవత్సరాలుగా నివాసం ఉంటున్నాయని తెలిపారు. మరుగుదొడ్లు, విద్యుత్, మంచినీటి సమస్యలతో స్థానికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదని చెప్పారు. ఇప్పటికైనా సరళాదేవి నగర్ ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు శ్రీరాం శ్రీనివాస్, కొత్తకోట వెంకటేశ్వర్లు, సరళాదేవి నగర్ కమిటీ కార్యదర్శి కైలా అజయ్, వందలాదిగా మహిళలు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న సరళాదేవి నగర్ వాసులు